క్లుప్తంగా

నేటి నుంచి అంకాలమ్మవారి జాతర

కోరుకొండ: గ్రామదేవత అంకాలమ్మ జాతర జూన్ 1 నుంచి 3వ తేదీ వరకూ కోరుకొండలో ఘనంగా నిర్వహించేందుకు కమిటీ బాధ్యులు ఏర్పాట్లు చేశారు. ఆదివారం అమ్మవారికి విశేష పూజలు నిర్వహించనన్నారు. సోమవారం గ్రామంలోని వీధుల్లో అమ్మవారి ఊరేగింపు నిర్వహించనున్నారు. మంగళవారం అమ్మవారికి భక్తులు నైవేద్యాలను సమర్పిస్తారు.

గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు

సీతానగరం: మండల కేంద్రమైన సీతానగరంలోని గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన తరగతులు లైబ్రేరియన్ టి.అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో కొనసాగుతున్నాయి. శనివారం సీతానగరం గ్రంథాలయంలో విద్యార్థులకు చదరంగం పోటీలు నిర్వహించారు. కథలు చెప్పడం, కథలు వినడం, పుస్తక పఠనం, పుస్తక సమీక్ష కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందించారు.

పారిశుధ్య కార్మికులకు వేతన బకాయిలు

కోరుకొండ పంచాయతీకి ఆదాయం నిల్

కోరుకొండ: స్థానిక పంచాయతీ పరిధిలో పని చేస్తున్న పారిశుధ్య కార్మికులకు జీతాలందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం పారిశుధ్య పనుల్లో 14 మంది కార్మికులు పనిచేస్తున్నారు. పంచాయతీకి ఆదాయం లేకపోవడంతో జీతాలివ్వడంలో జాప్యం జరుగుతోందని అధికారులు, పాలకులు అంటున్నారు. పారిశుధ్య కార్మికులకు రెండు నెలల జీతాలు ఇవ్వాల్సి ఉంది. ఈ విషయమై సర్పంచ్ కర్రి లక్ష్మీసరోజను వివరణ కోరగా పంచాయతీకి ఆదాయం లేదని, ప్రభుత్వ సహకారం కూడా అందకపోవడంతో ఆర్థిక లోటు నెలకొందని అన్నారు. ఇంటి పన్నుల వసూలులో ఆటంకం ఎదురైందన్నారు. శ్రీలక్ష్మీనరసింహ స్వామివారి దేవస్థానానికి చెందిన భూములు కావడంతో అధికారులు చొరవ చూపడం లేదన్నారు. ఇంటి పన్ను, కుళాయి పన్నులను సమాజహితం కోరేవారి నుంచి తప్ప, అందరి నుంచి వసూలు చేయడం లేదన్నారు. చాలామంది పంచాయతీ అనుమతులు పొందకుండా భవన నిర్మాణ సముదాయాలను నిర్మిస్తున్నారని తెలిపారు. సక్రమంగా పన్నులు చెల్లిస్తే ఆదాయం సమస్య ఉత్పన్నకాదని సర్పంచ్ అన్నారు.

సంపరలో వేంకటేశ్వరస్వామికి పంచామృతాభిషేకం

పెదపూడి: సంపరలో ప్రసిద్ధి చెందిన వేంకటేశ్వరుని ఆలయంలో శనివారం స్వామి వారికి పంచామృతాభిషేకం, పూజలు ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో హాజరైన భక్తుల సామూహికంగా గోవిందనామ పారాయణం చేశారు. ఈ సందర్భంగా స్వామి వారికి విశేషాలంకరణ చేశారు.

సబ్సిడీపై పశువుల దాణా పంపిణీ


పాడి రైతులకు పశువుల దాణా అందిస్తున్న డాక్టర్ రామచంద్రారెడ్డి

అనపర్తి : సబ్సిడీపై అనపర్తి మండలంలో పశువుల దాణాను పంపిణీ చేసినట్టు మండల పశు వైద్యాధికారి టి.రామచంద్రారెడ్డి తెలిపారు. శనివారం ఈ పంపిణీ కార్యక్రమాన్ని పొలమూరులో ప్రారంభించారు. రూ.1110 విలువైన 50 కిలోల దాణాను యాభై శాతం సబ్సిడీపై రూ.555 చెల్లించి రైతులు పొందవచ్చన్నారు. ఇప్పటికే మండల వ్యాప్తంగా 11 టన్నుల దాణాతో 220 బ్యాగులను మండలంలోని పాడి రైతులకు పంపిణీ చేసినట్టు ఆయన తెలిపారు.

సమాజంలో జర్నలిస్టులకు గౌరవ స్థానం


జక్కంపూడి విజయలక్ష్మిని సత్కరించిన ప్రెస్‌క్లబ్ సభ్యులు

కోరుకొండ: సమాజంలో జర్నలిస్టులకు అత్యంత గౌరవ స్థానం ఉందని రాజానగరం ఎమ్మెల్యే బీబీ ఆర్ కృష్ణ అన్నారు. కోరుకొండ ప్రెస్ క్లబ్‌ను శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల పక్షాన నిలబడేవారే జర్నలిస్టులన్నారు. ఈ సందర్భంగా ఆయనను శాలువా, పూలమాలతో సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీజీసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి పాల్గొని పాత్రికేయులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిజాన్ని నిర్భయంగా తెలియజేసేందుకు అందరూ కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆమెను ప్రెస్‌క్లబ్ సభ్యులు సత్కరించారు. జెడ్పీటీసీ సభ్యులు కర్రి నాగేశ్వరరావు, వైఎస్సార్ సీపీ నాయకులు కంటే వినయ్‌తేజ, పసుపులేటి బుల్లియ్య నాయుడు పాల్గొన్నారు.

కుష్ఠును అరికట్టేలా నిరంతర నిఘా

- తగ్గుతున్న కేసుల నమోదు
- ఎల్‌సీడీసీ సర్వేలో వెల్లడి
- స్పర్శలో ఇంటింటి సర్వే
- వ్యాధిపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు


కుష్ఠు వ్యాధిపై ఇంటింటి సర్వే నిర్వహిస్తున్న వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది (ఫైల్)

సీతానగరం: కుష్ఠు వ్యాధిపై నిరంతరం నిఘాను వైద్య ఆరోగ్యశాఖ చేపట్టడంతో వ్యాధి నిర్మూలనలో గణనీయమైన ప్రగతి కనిపిస్తోంది. గతంలో ఏటా విస్తరించిన ఈ వ్యాధి నాలుగేళ్లుగా తగ్గుముఖం పట్టడం ఇందుకు నిదర్శనం. ఇదే క్రమంలో నియోజకవర్గంలో వ్యాధి పీడితుల నమోదు తగ్గింది. కార్యాచరణ ఇలాగే కొనసాగిస్తే, నిర్మూలన అవకాశం ఉంటుందన్న ఆశాభావం కనిపిస్తోంది. లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపైన్ (ఎల్‌సీడీసీ)లోనూ కేసుల సంఖ్య బాగా తక్కువగా కనిపిస్తోంది. స్పర్శ కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన సదస్సులతోపాటు సర్వేను వైద్య ఆరోగ్యశాఖ చేపట్టింది.

నియోజకవర్గంలో అధిక సంఖ్యలో కేసులు

2018 నాటికి నియోజకవర్గంలో అధిక సంఖ్యలో కుష్ఠు వ్యాధి కేసులు నమోదయ్యాయి. దీంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకున్న చర్యలు, వ్యాధిగ్రస్తుల సర్వేలో ప్రత్యేక యాప్‌తో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ విధానంతో ఆశాజనకమైన ఫలితాలు వచ్చాయి. ఏటా కేసుల సంఖ్య గణనీయంగా తగ్గుతూ వచ్చింది. ఎల్‌సీడీసీ సర్వేలోను కేసుల సంఖ్య తగ్గుముఖం పట్టిన దాఖలాలు కనిపించాయి.

నియోజకవర్గంలో ఏటా జూన్ నుంచి జూలై వరకు, డిసెంబర్ నుంచి జనవరిలో లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్ రెండుసార్లు నిర్వహిస్తారు. అదే విధంగా ఏడాదిలో ఒకసారి జనవరి 30 నుంచి నుంచి ఫిబ్రవరి 13 వరకు స్పర్శ కార్యక్రమంలో భాగంగా కుష్ఠు వ్యాధి నిర్ధారణ కోసం ఇంటింటి సర్వే చేయడం, ప్రజల్లో ఈ వ్యాధిపై అవగాహన పెంచడం కోసం సదస్సులు నిర్వహించడం వంటి పలు కార్యక్రమాలు వైద్య ఆరోగ్యశాఖ చేపడుతోంది. ఏటా హెచ్చు తగ్గులతో కేసులు నమోదవుతున్నాయి.

బ్యాక్టీరియా కారణం

మైకో బాక్టీరియం లెప్రే (దీనిని లెప్రసీ బాసిల్లస్, హాన్సెస్ బాసిల్లస్) అనే బ్యాక్టీరియా క్రిమి కారణంగా కుష్ఠు వ్యాధి సంక్రమిస్తుంది. ఈ క్రిమి మనిషి శరీరంలోకి ప్రవేశించాక, వ్యాధి బయటపడేందుకు, సంబంధిత మనిషిలోని రోగనిరోధక శక్తి ఆధారంగా ఐదు నుంచి 30 ఏళ్లు పట్టొచ్చు.

నియోజకవర్గంలో కుష్ఠు వ్యాధి కేసుల నమోదు వివరాలు

మండలం	2022-23	2023-24	2024-25	మొత్తం
రాజానగరం	1	8	2	11
కోరుకొండ	4	5	7	16
సీతానగరం	1	5	5	11
మొత్తం	6	18	14	38

శరీరంపై తెల్లమచ్చలతో వ్యాధి లక్షణాలు మొదలవుతాయి. చేతులు, కాలివేళ్లు, మూతివంకర్లు పోవడం నుంచి పుండ్లు ఏర్పడి, వేళ్లు కోల్పోవటం వరకు తీవ్రత ఉంటుంది. చివరకు అంగవైకల్యానికి దారితీస్తుంది.

అందుబాటులోకి ప్రత్యేక యాప్

జిల్లా కేంద్రంలో ఓ యూనిట్‌ను ఉంచి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు అనుసంధానం చేశారు. కుష్ఠు వ్యాధి కేసులను ఇతర సంస్థలు గుర్తించినా, పీహెచ్‌సీకి అప్పగించాల్సిందే. దీంతోపాటు జాతీయ కుష్ఠు నిర్మూలన కార్యక్రమం–ఏపీ పేరుతో రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక యాప్‌ను 2020లో అందుబాటులోకి తెచ్చింది. ఈ విధానంలో దేశవ్యాప్తంగా చేపట్టిన సర్వేలో ముందుగా వివరాలు నమోదు చేసి, ఆ వివరాలను ఆన్‌లైన్ చేసేవారు. ఇందుకు భిన్నంగా రాష్ట్రంలో ప్రత్యేక యాప్‌తో నేరుగా ఒకేసారి ఆన్‌లైన్‌లో సర్వే నిర్వహించడం మొదలుపెట్టారు. నేడు అదే విధానం కొనసాగుతోంది.

సంజీవనిలా ఎండీటీ చికిత్స

ప్రపంచ ఆరోగ్య సంస్థతో చేసుకున్న ఒప్పందం ప్రకారం కేంద్ర ప్రభుత్వం 1980లో దేశవ్యాప్తంగా కుష్ఠు నిర్మూలనను చేపట్టింది. ఇంటింటి సర్వే చేసింది. లక్షణాలు కనిపిస్తే నమోదు చేసుకుని అక్కడే మోనోథెరపీ అనే మందును ఇచ్చేవారు. దీని స్థానంలో 1986లో బహుళ మందుల చికిత్స (ఎండీటీ) విధానం సంజీవనిలా వచ్చింది. ప్రభుత్వ లెప్రసీ యూనిట్లు, గ్రైటనాల్టస్ వంటి సంస్థలు ఇందులో చురుకుగా పనిచేశాయి. 2003 నాటికి వ్యాధి నిర్మూలన జరిగిందని, 10 వేల మందికి ఒకరు కూడా బాధితులు లేరనే భావనతో ప్రభుత్వం కార్యాచరణను తగ్గించింది.

మొదటి దశలోనే వ్యాధి గుర్తింపు



కుష్ఠు వ్యాధిపై నిరంతరం నిఘా పెట్టడంతో మొదటి దశలోనే వ్యాధిని గుర్తించడం వలన తీవ్రత తగ్గి, అంగవైకల్యం లేకుండా నిర్మూలన సాధ్యమవుతోంది. వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఏటా రెండుసార్లు ఎల్‌సీడీసీ కార్యక్రమం, ఒకసారి స్పర్శ కార్యక్రమాలు నిర్వహించి, ఇంటింటి సర్వేతోపాటు స్థానిక ప్రజలకు ఈ వ్యాధిపై అవగాహన కల్పిస్తున్నాం. అనుమానిత కేసులు ఉంటే మెడికల్ ఆఫీసర్ నేరుగా ఇంటికి వెళ్లి పరిశీలించి, నిర్ధారిస్తున్నాం. ముందుగా గుర్తించడం ద్వారా వ్యాధిని నిర్మూలించవచ్చు. వ్యాధిగ్రస్తులకు నేరుగా ఇంటికి మందులను పంపిణీ చేస్తాం. వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది వీరిని పర్యవేక్షిస్తారు

– డాక్టర్ ఏవీకె చైతన్య, పీహెచ్‌సీ వైద్యాధికారి, సీతానగరం

రత్నకుమార్ సేవలు మరువలేనివి


బిక్కవోలులో దేవిడ్ రత్నకుమార్, నూకరత్నం దంపతులను సత్కరిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

బిక్కవోలు: స్థానిక మండల పరిషత్ పరిపాలనాధికారిగా బాధ్యతలు నిర్వహించి శనివారం స్వచ్ఛంద ఉద్యోగ పదవీ విరమణ చేస్తున్న వేమగిరి డేవిడ్ రత్నకుమార్ సేవలు మరువలేనివని ఎంపీపీ తేతలి సుమ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం వద్ద సిబ్బంది ఆధ్వర్యంలో డేవిడ్ రత్నకుమార్, నూకరత్నం దంపతులను ఘనంగా సత్కరించి జ్ఞాపికను బహూకరించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ బి ఎస్‌వీవీ కృష్ణ, ఉద్యోగులు మాట్లాడుతూ రత్నకుమార్ సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలోని కొంకుదురు సర్పంచి సత్తి వీరమణి, పాలచర్ల చిట్టిబాబు చౌదరి, మాజీ ఎంపీటీసీ గొర్రెల త్రిమూర్తులు, కర్రి శ్రీనివాస్, పంచాయతీ డీఈ అచ్యుత్‌రామారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పొగాకు వాడకంతో పలు రకాల క్యాన్సర్లు

సీతానగరం: పొగాకు వాడకంతో పలు రకాలైన క్యాన్సర్లు వచ్చే ప్రమాదం ఉందని సీతానగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికార్లు డాక్టర్ ఏవీకే చైతన్య, డాక్టర్ సునీల్ హెచ్చరించారు. శనివారం సీతానగరం పీహెచ్‌సీలో వైద్యాధికార్లు చైతన్య, సునీల ఆధ్వర్యంలో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ సునీల్ మాట్లాడుతూ పొగాకును సిగరెట్, చుట్ట, బీడీ, గుట్కా, పాన్‌పరాగ్ వంటివి ఏ రూపంలో వినియోగించినా భయంకరమైన నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్ సోకే ప్రమాదం ఉందని అన్నారు. ప్రతి ఒక్కరూ పొగాకు వాడకానికి వ్యతిరేకంగా పోరాటం చేయాలని ఆయన తెలిపారు. అనంతరం ప్లకార్డులతో పొగాకు రహిత సమాజం – మన అందరి లక్ష్యం అంటూ పీహెచ్‌సీ సిబ్బంది నినాదాలు చేస్తూ అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎమ్‌పీహెచ్‌ఈవో వైయస్ రాయుడు, హెల్త్ సూపర్‌వైజర్ కె సుధాకర్, హెల్త్ అసిస్టెంట్లు నందీశ్, గంగాధర్, శ్రీను, వెంకట్రావు, కిషోర్, సూర్యచంద్ర, ఏఎన్ఎమ్‌లు తదితరులు పాల్గొన్నారు


సీతానగరం పీహెచ్‌సీ వద్ద ర్యాలీ ప్రారంభిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది

మానవహారంగా ఏర్పడి..

రాజానగరం: ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఆధ్వర్యంలో రాజానగరంలో శనివారం చైతన్య ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ పీహెచ్‌సీ నుంచి ప్రారంభమై, పోలీసు స్టేషను, బస్టాండ్, మార్కెట్ ఏరియా మీదుగా గాంధీ బొమ్మ సెంటరుకు చేరుకుంది. అక్కడ వైద్య సిబ్బంది, జీఎస్ఎల్ నర్సింగ్ కళాశాల విద్యార్థులు స్థానికులతో కలసి మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ జి. రామ్‌భాస్కర్, సూపర్‌వైజర్ ఎన్‌వీవీ రమణ పాల్గొన్నారు.


రంగంపేటలో పొగాకు వలన కలిగే అనర్థాలపై అవగాహన కల్పిస్తున్న ఆరోగ్య సిబ్బంది

పొగాకును విడనాడండి

రంగంపేట: ఆరోగ్యాన్ని ఎంచుకోండి పొగాకును కాదు అని రంగంపేట పీహెచ్‌సీ వైద్యులు బి.వేణు శ్రీలక్ష్మి అన్నారు. శనివారం రంగంపేట పీహెచ్‌సీ వద్ద ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం పాఠశాలు, కళాశాలలు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో అవగాహన సదస్సు, ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలోని డాక్టర్ కె.చిన్నారావు, ఆరోగ్య సిబ్బంది, పి.ప్రసాద్, మేరీహీలిన, పి .రాజేశ్వరరావు, పి.నాగలక్ష్మి పాల్గొన్నారు.

విజయకుమారి సేవలు స్ఫూర్తిదాయకం



విజయకుమారిని సత్కరిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత

అల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): జిల్లా స్త్రీశిశు సంక్షేమ, సాధికారత అధికారిణి విజయకుమారి సేవలు స్ఫూర్తిదాయకమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత అన్నారు. స్థానిక రజక ఫంక్షన్ హాల్లో విజయకుమారి పదవీ విరమణ మహోత్సవ కార్యక్రమానికి ఆమె, జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా విజయకుమారి, వీరరాఘవులు దంపతులను జ్ఞాపిక, శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి గంధం సునీత మాట్లాడుతూ జిల్లా న్యాయసేవాధికార సంస్థకు స్త్రీశిశు సంక్షేమ శాఖ ద్వారా విజయకుమారి పూర్తి సహకారం అందించారన్నారు. కలెక్టర్ పి.ప్రశాంతి మాట్లాడుతూ విజయకుమారికి తన విధులను సమర్థవంతంగా నిర్వహించారని, నేటితరం ఉద్యోగులు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. విజయకుమారి మాట్లాడుతూ ఉద్యోగులు, అధికారులు, ఉన్నతాధికారులు, కుటుంబ సభ్యులు ప్రోత్సాహం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో డీఎల్‌డీవో వీణీదేవి, సమగ్రశిక్ష ఏపీడీ సుభాషిని, నోడల్ ఆఫీసర్ నాగలక్ష్మి, సీడీపీవోలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

సుబ్బారావు సేవలు ఆదర్శనీయం


సుబ్బారావు దంపతులను సత్కరిస్తున్న దేవదాయ శాఖ సిబ్బంది

కడియం : దేవదాయ శాఖ ఉద్యోగిగా ఏ హోదాలో ఉన్నా ఆయా ఆలయాల ఆదాయ వనరులు పెంచడంతో పాటు, భక్తులకు మెరుగైన సేవలు అందిస్తూ అందరి మన్ననలు పొందిన బహదూర్‌షా వెంకటసుబ్బారావు (ఈవో సుబ్బారావు) సేవలు అభినందనీయమని జిల్లా దేవాదాయ ధర్మాదాయ శాఖాధికారి కే నాగేశ్వరరావు అన్నారు. వీరవరం కోదండరామ స్వామి, రామలింగేశ్వర స్వామి ఆలయాలకు గ్రేడ్ 2 ఈవోగా పనిచేసి పదవీ విరమణ పొందిన సుబ్బారావు అభినందన సత్కారం రాజమహేంద్రవరంలోని చందా సత్రంలో ఘనంగా నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలోని ప్రసిద్ధ ఆలయాలకు ఈవోగా సుబ్బారావు సేవలందించి ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా పనిచేసి అందని మన్ననుల పొందారని నాగేశ్వరరావు ఈ సందర్భంగా గుర్తు చేసారు. అనంతరం సుబ్బారావు దంపతులను శాలువా, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఎండోమెంట్ ఉద్యోగుల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ టీవీఎస్ ప్రసాద్, చందాసత్ర ఈవో శ్రీదేవి, టి సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ సేవలకు రోటరీ క్లబ్ అవార్డులు

రాజమహేంద్రవరం సిటీ: నగరంలో పలు విభాగాల్లో విధుల నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారిని గుర్తించి వారికి అవార్డులు అందించే కార్యక్రమం నిర్వహించినట్లు రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ అధ్యక్షుడు నాళంనరసింహారావు తెలిపారు. శనివారం రాజమహేంద్రవరం ఏకేసీ రోటరీ హాల్‌లో, రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులు 2024–25 ప్రదానం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో అత్యుత్తమ సేవలందిస్తున్న 23 మందికి రోటరీ ఒకేషనల్ ఎక్సలెన్స్ అవార్డులను లెఫ్టినెంట్ జాస్తి మూర్తి, విశిష్ట అతిథి బుర్లగడ్డ సుబ్బారాయుడు, ఒకేషనల్ సర్వీసెస్ డైరెక్టర్ ఏలేటి రవిబాబు, అసిస్టెంట్ గవర్నర్ దొరబాబు, కార్యదర్శి చంద్రశేఖర్ చేతుల మీదుగా రోటరీ లాంఛనాలతో, అవార్డులు అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ చార్టెడ్ అకౌంట్ వి.భాస్కరరామ్, మద్దూర్ శివ సుబ్బారావు, బెరులాల్ జైన్, గౌతమి ఇన్‌స్టిట్యూట్ చైర్మన్ వాడ్రేవు డాక్టర్ వీకే రాజు, కేటీ కృష్ణారావు, నాలం రాహుల్, హసన్, నాగేంద్ర కిషోర్ పాల్గొన్నారు.


అవార్డుల గ్రహీతలతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

అర్బన్ డీఐకు ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం అర్బన్ స్కూల్స్ డీఐ బి.దిలీప్‌కుమార్, ఆదిత్య కళాశాల ప్రొఫెసర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ జీవీఎస్.నాగేశ్వరరావు ఒకేషనల్ ఎక్సలెన్సీ అవార్డు అందుకున్నారు. రోటరీ క్లబ్ ఆఫ్ రాజమండ్రి రివర్ సిటీ ఆధ్వర్యంలో శనివారం ఏకేసీ రోటరీ హాలులో నిర్వహించిన కార్యక్రమంలో వారికి ఈ అవార్డును ప్రదానం చేసారు. కార్యక్రమంలో జాస్తి మూర్తి, బొర్ల గడ్డ వెంకటసుబ్బారాయుడు, నాళం నరసింహారావు, ఏలేటి రవిబాబు, కనకం చంద్రశేఖరరావు పాల్గొన్నారు.

కేసులను త్వరితగతిన పరిష్కరించాలి

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): అండర్ ఇన్వెస్టిగేషన్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలి, గ్రేవ్ ఎక్విటల్, మిస్సింగ్, పోక్సో, ఎస్సీ, ఎస్టీ కేసులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఎస్పీ డి.నరసింహకిశోర్ సూచించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో నెలవారీ క్రైం రివ్యూ మీటింగ్ శనివారం జరిగింది. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేసేందుకు డ్రోన్ల ద్వారా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేయాలన్నారు. పోలీసింగ్, రాత్రి గస్తీని మరింత బలోపేతం చేయాలన్నారు. కార్యక్రమంలో జిల్లాలోని పోలీసు అధికారులు పాల్గొన్నారు.

వ్యక్తి దుర్మరణం


రెడ్డి పైడారావు (ఫైల్)

బిక్కవోలు: పందలపాకలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతి చెందగా, మరొకరికి గాయాలయ్యాయని ఎస్సై వాసంశెట్టి రవిచంద్ర కుమార్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పందలపాక గ్రామానికి చెందిన రెడ్డి పైడారావు (57) పనిపై తొస్సిపూడి వెళ్లి తిరిగి బైకుపై ఇంటికి వస్తుండగా... తొస్సిపూడి సెంటర్‌లో గుడిమెట్ల శ్రీనివాస్‌రెడ్డిని వస్తున్నారు. పందలపాక కోదండరామా రైస్‌మిల్లు వద్దకు వచ్చేసరికి, ధాన్యం ట్రాక్టర్ వేగంగా వెళ్తూ ఒక్కసారిగా బ్రేక్ వేయడంతో వెనుక వస్తున్న వీరు అదుపు తప్పి ట్రాక్టర్‌ను ఢీకొట్టడంతో ఇద్దరూ గాయపడ్డారు. దీంతో వారిని అనపర్తి సీహెచ్‌సీకి తరలించడంతో రెడ్డి పైడారావు మృతి చెందాడు. గుడిమెట్ల శ్రీనువాస్‌రెడ్డి గాయాలతో చికిత్స పొందుతున్నాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు. అందరితో సరదా ఉండే వ్యక్తి మృతితో విషాదఛాయలు అలముకున్నాయి.

అవగాహన ర్యాలీ

కంబాలచెరువు: పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జీఎస్ఎల్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో శనివారం పుష్కర్ ఘాట్‌లో మానవహారం నిర్వహించారు. జీఎస్ఎల్ కేన్సర్ హాస్పిటల్ నుంచి పుష్కర్ ఘాట్ వరకూ విద్యార్థులు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు.

విధి నిర్వహణలో అంకితభావం అలవర్చుకోవాలి


శహపురంలో ఉమామహేశ్వరరావు దంపతులను సన్మానిస్తున్న సత్యనారాయణరెడ్డి

పెదపూడి: విధి నిర్వహణలో ప్రతి ఒక్కరూ అంకిత భావం అలవరుచుకోవాలని ఇన్‌చార్జి ఎంపీడీఓ ఎం .సత్యనారాయణరెడ్డి అన్నారు. శహపురం గ్రామ సచివాలయం కార్యదర్శి యాళ్ల ఉమామహేశ్వరరావు పదవీ విరమణ సందర్భంగా అభినందన సత్కార సభ శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణరెడ్డి మాట్లాడుతూ ఉమామహేశ్వరరావు విధి నిర్వహణలో ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉత్తమ సేవలు అందించి, ప్రజల నుంచి ఆదరణ, అభిమానం పొందారన్నారు. విధి నిర్వహణలో నిస్వార్థ సేవలు అందించే వారు మంచి గుర్తింపు పొందుతారన్నారు. అనంతరం ఉమామహేశ్వరరావు ఆయన సతీమణి శ్రీలక్ష్మికి శాలువా కప్పి, పూలమాలలు వేసి జ్ఞాపిక అందించి ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వనుం శాంతకుమారి, ఎంపీటీసీ సభ్యురాలు సీహెచ్.పార్వతీ, సచివాలయం కార్యదర్శులు మన్యం శ్రీనివాసు చౌదరి, సుంకర వీరస్వామి నాయుడు, భోగరాజు ప్రసన్నాంజనేయులు, జి.ఉషారాణి, లక్ష్మీనారాయణ, స్వరూప్‌రెడ్డి పాల్గొన్నారు.

పుట్టకొండలో ఘనంగా ప్రారంభమైన సప్తాహం


పుట్టకొండలో ఆధ్యాత్మిక కీర్తనలు ఆలపిస్తున్న భజన మండలి సభ్యులు

పెదపూడి: సప్తాహాలు నిర్వహించడంతో ఆయా గ్రామాలు సుభిక్షంగా ఉంటాయని పుట్టకొండ సర్పంచ్ వల్లు వెంకటరమణ అన్నారు. పుట్టకొండలో శనివారం సీతారామచంద్రస్వామి ప్రథమ సప్తాహాలు భద్రకాళీ సమేత వీరభద్రస్వామి ఆలయ ప్రాంగణంలో ఘనంగా ప్రారంభమయ్యాయి. ప్రముఖ పండితులు పి.కమలాకర్, చంద్రమౌళి సుబ్రహ్మణ్యశర్మ పండితుల ఆధ్వర్యంలో తెల్లవారు జామున 4 గంటలకు నగర సంకీర్తన అనంతరం విఘ్నేశ్వర పూజ, పుణ్యాహవచనం, కలశ స్థాపన, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. 5.30 గంటలకు భజన బృందం సంకీర్తనలతో సప్తాహ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామస్తులు, భక్తుల సహకారంతో సప్తాహం నిర్వహిస్తున్నామన్నారు.

సారా తయారీ నిందితుల అరెస్టు

రంగంపేట: సారా తయారీదారులను అరెస్టు చేసినట్లు రంగంపేట ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ సుధ తెలిపారు. శనివారం మండలంలోని ఈలకొలనులో దాడులు నిర్వహించగా 30 లీటర్లు సారా స్వాధీనం చేసుకున్నామన్నారు. 800 లీటర్లు బెల్లపు ఊటను ధ్వంసం చేసినట్లు తెలిపారు. దేవినేద్ది శ్రీనుబాబు, ఊల్లి రాజును అరెస్టు చేసినట్టు తెలిపారు. దొంతమూరుకు చెందిన పరారీలో ఉన్న ముద్దాయి తోగరా సత్తిబాబును అరెస్టు చేసి రిమాండ్ పంపించినట్లు తెలిపారు.

యోగా సాధనతో ఆరోగ్యం

రంగంపేట: యోగాను అలవాటు చేసుకొని ఆరోగ్యంగా జీవించాలని రంగంపేట పీహెచ్‌సీ వైద్యులు వేణు శ్రీ లక్ష్మీ అన్నారు. శనివారం యోగా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా ప్రతి ఒక్కరూ తమ జీవనశైలిలో భాగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె.చిన్నారావు పాల్గొన్నారు.